క్లుప్తంగా

పాదచారులకు దారేదీ?



నడిరోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో అవస్థలు పడుతున్న పాదచారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌తోపాటు బాలికల జూనియర్ కళాశాలకు రాకపోకలకు బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌తోపాటు రోడ్డుపై కూడా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో పాదచారులు, పాఠశాల, కళాశాలకు వచ్చే విద్యార్థినులు భయాందోళనలకు గురవుతున్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని ప్రైవేట్ అంబులెన్సులతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వాహనాలు సైతం రోడ్లపై తమ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అదే ప్రాంతంలో ప్యాసింజర్ ఆటోలు కూడా పార్కింగ్‌ను ఆక్రమించుకుని ఆటో స్టాండ్‌గా మార్చేశారు.

గుండు నాగప్ప స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న గుండు నాగప్పస్వామి

కూడేరు: కొర్రకోడు సమీపంలో ఉన్న గుండు నాగప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పుష్పాలతో గుండు నాగప్ప స్వామికి పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. సాయంత్రం కొర్రకోడు, చోళసముద్రం గ్రామాలవారితో భజన చేయించారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: రాయదుర్గం ఎంపీపీ విద్యావతి భర్త శివారెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లెల రామకృష్ణారెడ్డి కుమార్తె వివాహం రవికుమార్‌రెడ్డితో ఆదివారం జరిగింది. వేడుకకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి , రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కురుబ అరుణ్ కుమార్, తాలూక ఐటీ వింగ్ అధ్యక్షుడు బోర్‌వెల్ ఆనందరెడ్డి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. మెట్టు వెంట కణేకల్లు, డి హీరేహాళ్, గుమ్మఘట్ట, డి హీరేహాళ్, రాయదుర్గం మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో..

బొమ్మనహాళ్: కురువల్లి సర్పంచ్ జయరామిరెడ్డి కుమారుడు రంగారెడ్డి, వందనారెడ్డి వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో రంగారెడ్డి, వందనారెడ్డి వివాహం జరిగింది. పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు లోకేష్, పరమేశ్వర, పయ్యావుల సత్యన్న, చంద్రశేఖర్‌రెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, యర్రగుంట కేశవరెడ్డి, కోటేశ్వరరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, దేవరెడ్డి, ముక్కన్న, అంజిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఖాజావలి,వన్నూరుస్వామి, ఆనంద్‌రెడ్డి, ఆంజినేయులు, వెంకటేష్, యోగేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ప్రణయ్‌రెడ్డి



వధూవరులతో వైఎస్సార్‌సీపీ రాయలసీమ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత బూదిగుమ్మయ్య కుమారుడు చెన్నకేశవ వివాహం రాజేశ్వరితో ఆదివారం ఆత్మకూరులో వధువు స్వగృహం వద్ద జరిగింది. వేడుకకు వైఎస్సార్ సీపీ రాయలసీమ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. చెన్నకేశవ్-రాజేశ్వరికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ దేవ, వైఎస్సార్ సీపీ నేతలు ఎర్రిస్వామి, ఆదినారాయణ, కుళ్లాయిస్వామి, ఎర్రిస్వామి, సంజీవరాయుడు, విష్ణు, అరవింద్ పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి ప్రత్యేక పూజలు

రాయదుర్గంటౌన్: ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాకుండా కర్ణాటక నుంచి హాజరై, మొక్కులు తీర్చుకున్నారు.

సేద్యం సాగేదెలా?

- ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న రైతులు
- అనుకూలిస్తున్న ముందస్తు వర్షాలు
- సుఖీభవ .. ప్రకటనకే పరిమితం
- రైతులపై కూటమి సర్కార్ చిన్నచూపు



బీడు భూమిలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు



వేరుశనగ విత్తనాలు సిద్ధం చేసుకుంటున్న దృశ్యం

రాయదుర్గం: ముందస్తు వర్షాలు కురుస్తున్నాయి.. ముంగారు సేద్యాలు మొదలయ్యాయి. రైతన్నలు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. పెట్టుబడి సాయం ఊరిస్తోంది. సుఖీభవ హామీ ప్రకటనలకే పరిమితమయ్యింది. రైతులపై కూటమి సర్కారు చిన్న చూపు చూస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో మే నెలలోనే తొలివిడతగా పీఎం కిసాన్- రైతు భరోసా కింద రూ.7,500 నగదు రైతు ఖాతాల్లో జమ అయ్యేది. ఈ పథకం ద్వారా ఇచ్చే రూ.13,500 మొత్తాన్ని రూ.20వేలకు పెంచి అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సార్వత్రిక ఎన్నికలప్పుడు కూటమి నేతలు ఊరూవాడా ఊదరగొట్టారు. అధికారం చేపట్టి పది నెలలవుతున్నా దాని ఊసేలేదు. ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకోవడానికి కష్టంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని సాధారణ సాగు విస్తీర్ణం 2,90,481హెక్టార్లు కాగా, 2,44,930 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా. అందుకు తగ్గట్టుగా విత్తనాలు, ఎరువులు సమకూర్చేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉన్నా.. నేటికీ కార్యాచరణకు శ్రీకారం చుట్టలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో వెన్నుదన్ను..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 7,35,353 మంది రైతులకు రూ.985.04 కోట్లు పెట్టుబడి సాయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం ద్వారా నేరుగా ఖాతాల్లోకి జమచేసి సీఎం హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నిలిచారు. కూటమి సర్కార్ ఆ దిశగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు..

పెట్టుబడి సమకూర్చుకొని ముందస్తుగా వేసవి దుక్కులు చేసుకుంటే లాభసాటి పంటలు తీయొచ్చని రైతులు అంటున్నారు. పంటల ఉత్పత్తి పెరగడంతో పాటు చీడ, పీడల బెడద ఉండదు లోతు దుక్కులతో వర్షపునీరు నేలలోనే ఇంకి పంటలకు మేలు జరుగుతుంది. ఇటీవల అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకునేందుకు తేమ శాతం ఉంది. పశువుల ఎరువులను దుక్కిలో కలిపితే నేలలో సాంద్రత పెరిగి, అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది. జీవాల సంఖ్య తగ్గిపోవడంతో గ్రాసం కొరత వచ్చింది. సేద్యం చేయాలంటే యంత్రాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఏటేటా పెట్టుబడి మొత్తం పెరుగుతోంది. ఎరువులు, విత్తనాల ధర పెరుగుతోంది. వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయి. గతంలో వేసవి వచ్చిందంటే రాత్రిపూట జీవాల మందలు పొలాల్లో తోలించేవారు. జీవాల మందు తోలించాలన్నా.. పేడ ఎరువు కొనుగోలు చేయాలన్నా భారమవుతోంది. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయమైనా అందితే కొంత ఊరట లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	సాధారణ సాగు (హెక్టార్లు)	సాగు అంచనా (హెక్టార్లు)
రాయదుర్గం	62,629	38,510
కళ్యాణదుర్గం	67,754	55,800
ఉరవకొండ	1,60,098	1,50,620

వైఎస్సార్‌సీపీ హయాంలో అందుకున్న రైతు భరోసా సాయం

నియోజకవర్గం	రైతులు	సాయం రూ. కోట్లలో
రాయదుర్గం	2,17,424	రూ.283.55
కళ్యాణదుర్గం	2,66,787	రూ.347.41
ఉరవకొండ	2,51,142	రూ.327.08
మొత్తం	7,35,353	రూ.958.04



పొలాల్లోకి పేడ ఎరువు తరలిస్తున్న రైతులు

వ్యవసాయం చేసేదెలా?



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చుల కోసం రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా పథకం ద్వారా ఏటా ఈ సీజన్‌లో రూ.7,500 నేరుగా ఖాతాల్లోకి జమ చేశారు. ప్రస్తుతం కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పేరుతో దాన్ని రూ.20 వేలకు పెంచి ఇస్తామన్నారు. నేటికీ అతీగతీ లేకుండా పోయింది.

– బోర్‌వెల్ ఆనందరెడ్డి, రైతు, రాయదుర్గం

వేసవి దుక్కులు చేసుకోవాలి

వేసవిలో లోతు దుక్కులు చేసుకోవడం వల్ల రైతులకు వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. ఎండాకాలంలో సేంద్రియ ఎరువులు పొలాల్లో చల్లితే పంటల దిగుబడి బాగుంటుంది. సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రాయితీతో అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే ఇబ్బంది లేకుండా వీటన్నింటినీ సమకూరుస్తాం.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

22 నుంచి వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు



బొమ్మనహాళ్‌లో వెలసిన వేంకటరమణ స్వామి



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన వేంకటరమణస్వామి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. బొమ్మనహాళ్‌లో ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో రూ.కోట్లతో హంపీ తరహాలో శిల్ప కళా నైపుణ్యంతో వేంకటరమణ స్వామి ఆలయాన్ని నిర్మించారు.

శ్రీవారి విశిష్టత : బొమ్మనహాళ్‌లో పదేళ్ల క్రితం రూ.1.50 కోట్లతో శిల్ప కళానైపుణ్యంతో ఆగమ శైవ క్షేత్రంగా అక్షయ తృతీయ రోజున నిర్మించారు. ఇక్కడ వెలసిన శ్రీవారు శ్రీనివాసుడిగా, బాల కృష్ణుడిలా, నరసింహస్వామిగా, సంతాన వేణుగోపాల స్వామిగా, వరాహ స్వామిగా, వేంకటేశ్వర స్వామిగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు.

22 నుంచి వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు : స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 22న సాయంత్రం 5 గంటలకు పవిత్ర జలం తీసుకొచ్చి గంగపూజ నిర్వహించి, ఊరేగింపు నిర్వంచనున్నట్లు తెలిపారు. గోపూజ, ధ్వజారోహణ, కంకణధారణ, మహామంగళహారతి పూజలు జగుతాయన్నారు. 23న శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం, దీక్షాహోమం జరుగుతుందన్నారు. సాయంత్రం సూర్యప్రభ, చంద్రపభ, హనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 24న శేషవాహనంపై , 25న గణవాహనంపై, 26న గరుడ వాహనం, 27న సింహవాహనం, 28న అశ్వవాహనం, 29న కామధేను వాహనంలో శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు.

30న శ్రీవారి రథోత్సవం : బొమ్మనహాళ్‌లో శ్రీవారి రథోత్సవం 30న సాయంత్రం నాలుగు గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మడుగు రథోత్సవం, దీక్షాహోమం, మంగళహారతి, అన్నదాన కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిపారు. మే నెల 1న పార్వేట జరుగుతుందన్నారు.

భూమి సర్వే చేయిస్తుంటే రైతుపై దౌర్జన్యం



కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత రైతు రామిరెడ్డి

కళ్యాణదుర్గం: మండల పరిధిలోని కడదరకుంటకు చెందిన రైతు రామిరెడ్డి తన పొలం హద్దులకోసం సర్వే చేయిస్తుండగా కొందరు రైతులు దౌర్జన్యం చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.వివరాలు..తిమ్మసముద్రం పొలం కడదరకుంటలో సర్వే నం 502-1లో రామిరెడ్డికి 5.2 ఎకరాల పొలం ఉంది. పొలానికి హద్దులు చూపాలని తహసీల్దార్, సర్వేయర్లను పలుమార్లు కలిసి అర్జీలు ఇచ్చుకున్నాడు. అయితే శనివారం సచివాలయ సర్వేయర్ ధనుంజయ సర్వేకోసం రాగా, పొరుగున ఉన్న చాకలి ప్రసాద్, చాకలి ముత్యాలు, చాకలి జయప్ప, వారి కుటుంబ సభ్యులు సర్వేయర్‌ను అడ్డుకుని తనపైనా, తన భార్య జయమ్మపైన దాడి చేశారని బాధితుడు రామిరెడ్డి వాపోయాడు. సుమారు 20 మందికి పైగా ట్రాక్టర్‌లో వచ్చి తమను దుర్భాషలాడుతూ మూకుమ్మడిగా దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. అనంతరం జరిగిన ఘటనపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



సురేష్ భార్య ప్రశాంతికి నగదును అందిస్తున్న అప్పటి క్లాస్ టీచర్ అనంతమ్మ

బెళుగుప్ప: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల్లో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన ఆర్‌హెచ్ సురేష్ కుటుంబానికి తోటి మిత్రులు ఆదివారం చేయూతనందించారు. మిత్రుడు సురేష్ అనంతపురంలో భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. బాధితురాలు ప్రశాంతితోపాటు ఇంటర్ చదువుతున్న కుమార్తె అమృత, మరో కుమార్తె లక్కీ, కుమారుడు విక్కీ ఉన్నారు. మిత్రులందరూ కలిసి ఫాదర్ పెర్రర్ కాలనీలోని సురేష్ స్వగృహానికి వెళ్లి మిత్రుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రూ.50 వేల నగదు, రూ.3వేల నిత్యావసర సరుకులను తోటి మిత్రుడు ఎస్‌ఆర్‌ఐ పాటిల్ సోమశేఖర్ తల్లి నాటి క్లాస్ టీచర్ అయిన అనంతమ్మ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సురేష్ మిత్రులు నాగరాజు, అనిల్‌కుమార్, అమర్‌నాథ్, మల్లికార్జున, జయరామిరెడ్డి, శివరుద్ర, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో పునరుత్థాన ఆరాధన



రాయదుర్గం : జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్‌లో ప్రార్థనలు



కూడేరు: బేతనీయ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు చర్చిలకు తరలివచ్చారు. పట్టణంలోని సెయింట్ మేరి చర్చి, డాక్టర్ ఎస్ఆర్ జాన్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, ఎఫ్రాత ప్రార్థనా మందిరం, క్రైస్ట్ చర్చి, కింగ్ ఆఫ్ షాలేం క్రైస్ట్ చర్చి, జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్, గిల్గాలు చర్చి, బ్రదరన్ అసెంబ్లీ, హోసన్న ప్రార్థన మందిరాల్లో పాస్టర్లు ఈస్టర్ సందేశాన్ని వివరించారు. చర్చిల్లో బైబిల్ పఠనం, ప్రత్యేక పాటలు, పునరుత్థాన ఆరాధన గీతాలు ఆలపించారు.

కూడేరు: యేసు మరణంపై సాధించిన విజయానికి ప్రతీక ఈస్టర్ పండుగ అని చర్చి పాస్టర్లు పేర్కొన్నారు. ఆదివారం జల్లిపల్లి, ఉదిరిపికొండ, కలగళ్ల, అరవకూరు, కూడేరులోని బేతనీయ, కవనెంట్‌తో పాటు ఇతర గ్రామాల్లోని చర్చిలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా చర్చిలకు క్రైస్తవులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అందని శ్రీరామరెడ్డి పథకం నీరు



ఉద్దేహాళ్‌లో దిష్టిబొమ్మలా ఉన్న కుళాయిలు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు, బండూరు, దేవగిరి, ఉంతకల్లు, శ్రీరంగాపురం క్యాంపు, కురువల్లి తదతర గ్రామాలకు 15 రోజుల నుంచి శ్రీరామరెడ్డి పథకం తాగునీరు అందలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొలనగాహళ్లి, లింగదహాళ మైలాపురం, కృష్ణాపురం తదితర గ్రామాల్లో రెండేళ్ల నుంచి నీరు సరఫరా లేక నానా అవస్థలు పడుతున్నారు. శ్రీరామరెడ్డి పథకం తాగునీటి సిబ్బందికి 6 నెలలుగా జీతాలు, 30 నెలలుగా పీఎఫ్ అమౌంట్ రాలేదని నిరసన చేస్తుండడంతో శ్రీరామరెడ్డి తాగునీరు గ్రామాల్లో నిలిచిపోయాయి. దీంతో మండల వ్యాప్తంగా తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. తాగునీటి కోసం గ్రామాల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని దర్గాహొన్నూరు శ్రీరామరెడ్డి తాగునీరు లేకపోవడంతో దర్గాకు వచ్చే ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శ్రీనునాయక్‌ను అడగ్గా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం అధికారులకు తెలియజేసి, సమస్య పరిష్కరిస్తామన్నారు.

23న వాహనాలు బహిరంగ వేలం

కళ్యాణదుర్గం రూలర్: కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, కారు ఈనెల 23న బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ వంశీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.1000, కారు వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.3వేలు రుసుం చెల్లించాలన్నారు.

ఆర్డీటీ సెట్‌కు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం: ఆర్డీటీ సెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సమన్వయకర్త అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చేందుకు ఉత్సాహంగా ముందుకొచ్చిన ఉపాధ్యాయులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ కళ్యాణదుర్గంలోని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వేసవి సెలవుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఆర్డీటీ సెట్‌కు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శెట్టూరు ఎంఈఓ శ్రీధర్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేశులు, యూటీఎఫ్ ఈశ్వరయ్య, ఎస్టీయూ మల్లికార్జున, టీఎన్‌ఎస్‌యూ నరసింహులు, ఎస్ఆర్టీఏ నారాయణ, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ బద్దేనాయక్, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, అబ్దుల్ వహాబ్, ఆది ఆంధ్ర తిప్పేస్వామి, సబ్జెక్టు నిపుణులు షాజహాన్, సతీష్, మురళి, మల్లికార్జున, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య విగ్రహావిష్కరణ



ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: కంబదూరు మండల కేంద్రంలోని హిందూపురం రోడ్డులో ఏర్పాటు చేసిన ఎరుకుల ఆరాధ్య దైవం ఏకలవ్య విగ్రహావిష్కరణ జరిగింది. ఆదివారం ఉదయం వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, జేసీఎస్ కన్వీనర్ సాకే గంగాధర్, నాయకులు వెంకటేశులు, వార్డు మెంబర్ రాజు, రమేష్, సత్యంతో పాటు పలువురు విగ్రహావిష్కరణకు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బచ్చేహళ్లిలో గాలీవాన బీభత్సం



బచ్చేహళ్లిలో కూలిపోయిన విద్యుత్ స్తంభం

శెట్టూరు: శెట్టూరు మండలం బచ్చేహళ్లిలో ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించాయి. గ్రామంలోని గొల్లలదొడ్డిలో ఒకేసారి గాలీవానతో నీలగిరి చెట్లు నేలకొరిగాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ఇంటి పైకప్పుపైనుండే రేకులు గాలికి ఎగిరిపడ్డాయి. గాలీవాన రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.



గాలికి కొట్టుకుపోయిన రేకులు



నిరుపయోగంగా ఉన్న తాగునీటి కుళాయి



మరుగుదొడ్లకు తాళం వేసిన దృశ్యం

అసౌకర్యాల నడుమ ఆర్టీసీ బస్టాండ్

కూడేరు: అధికారుల నిర్లక్ష్యంతో కూడేరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఎండలు మండిపోతున్నా కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్, కొళాయిలు దెబ్బతిని పూర్తిగా తొలగిపోయాయి. మరుగుదొడ్లలోకి నీటి సరఫరా లేక మరుగుదొడ్లను మూసేశారు. మహిళా ప్రయాణికులు మరుగుదొడ్లు లేక మలమూత్ర విసర్జనకు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణను కనీసం శుభ్రంగా ఉంచడంలేదు. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.